క్లుప్తంగా

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న విజయ్ భాస్కర్

పెందుర్తి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సమగ్ర శిక్ష రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలకు తొమ్మిది రోజుల శిక్షణ తరగతులను పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన అబ్జర్వేషన్లను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.సువర్ణ, జిల్లా సహాయ ఎ.ఎం.వో జి.లక్ష్మి, పెందుర్తి ఎంఈవో-2 మధుమూర్తి పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in/ ను సందర్శించి.. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు జూలై 31వ తేదీతో గడువు ముగుస్తుందని, పూర్తి వివరాలకు ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

కంప్యూటర్ ల్యాబ్ నేడు ప్రారంభం

పరవాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఫుట్‌పాత్‌పై షెడ్ల తొలగింపులో ఉద్రిక్తత

- ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశాలతో తొలగించిన జీవీఎంసీ అధికారులు
- బతుకుతెరువు లేకుండా చేశారని యజమానుల ఆవేదన
- ఈ దుస్థితికి కార్పొరేటర్ భర్తే కారణమన్న బాధితులు



ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాలతో ఫుట్‌పాత్‌పై షెడ్లను తొలగిస్తున్న సిబ్బంది

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్ బీఆర్‌టీఎస్ రహదారి ఫుట్‌పాత్‌పై ఉన్న షెడ్ల తొలగింపులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాదాపు 20 ఏళ్లగా ఇక్కడ బతుకుదెరువు కోసం షెడ్‌లలో బైక్ మరమ్మతులు, టిఫిన్ సెంటర్లు నడుపుకుంటున్నామని..ఇప్పుడు అకస్మత్తుగా వాటిని తొలగించడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్పొరేటర్ భర్త శంకర్రావు ప్రోద్బలంతోనే ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వీటిని తొలగించాలని ఆదేశాలు ఇచ్చారని..ఇది న్యాయం కాదని బాధితులు ఆరోపించారు. వివరాలివి..జీవీఎంసీ 97వ వార్డు క్షేత్ర పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సప్తగిరినగర్‌కి వెళ్లారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పంచకర్లతో మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రహదారి గెడ్డ ఆధునీకరణకు నోచుకోకపోవడంతో వర్షాల సమయంలో గెడ్డ నీరు కాలనీలో నిలిచిపోతుందని చెప్పారు. దీంతో తక్షణమే గెడ్డ ఆధునీకరణ కోసం ఫుట్‌పాత్ నిర్మాణాలు తొలగించి తగిన పనులు చేపట్టాలని జీవీఎంసీ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. దీంతో హుటాహుటిన జీవీఎంసీ అధికారులు షెడ్‌లను తొలగించారు.

పేదల పొట్ట కొట్టారు

కాగా స్థానిక కార్పొరేటర్ శానాపతి వసంత భర్త శంకర్రావు కక్షపూరితంగా తమ ఉపాధి కోసం వేసుకున్న షెడ్లను తొలగించేలా చేశారని బాధితులు ఆరోపించారు. దాదాపు 20 ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో జీవనం పొందుతున్న తమను ఇలా అకస్మత్తుగా రోడ్డున పడేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ భర్త ప్రోద్బలంతోనే జీవీఎంసీ అధికారులు దుందుడుకు చర్యలకు దిగారని మండిపడ్డారు. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా తొలగించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అయితే కాలనీ వాసుల వినతి మేరకే జీవీఎంసీ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు తప్ప ఈ వ్యవహారానికి తమకు ఎలాంటి సంబంధం లేదని టీడీపీ నేత శంకర్రావు స్పష్టం చేశారు.

సింహగిరిపై ఘనంగా కృష్ణమయ్య సంకీర్తనా జయంతి



అప్పన్న ఆలయ బేడా మండపంలో కృష్ణమయ్య విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న వైదికులు, ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : ఆషాఢ ద్వాదశిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం కృష్ణమయ్య సంకీర్తనల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం వద్ద దేవస్థానం అర్చకులు షోడషోపచార పూజలు నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. కృష్ణమయ్య రచించిన వచన సంకీర్తలను స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆలపించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. తిరుమల అన్నమాచార్యుల వలే సింహాచల క్షేత్రంలో శ్రీకాంత కృష్ణమాచార్యులు ప్రసిద్ధి చెందినవారు. సింహాద్రినాథుడిపై ఆయన చాతుర్లక్ష వచన సంకీర్తనలు రచించారు. ఆసంకీర్తనలు రచించిన రోజు ఆషాఢ ద్వాదశి కావడంతో ఏటా ఆరోజు కృష్ణమయ్య సంకీర్తనల జయంతిని నిర్వహిస్తుంటారు.

అల్పపీడనంతో అల్లకల్లోలంగా సముద్రం



సురక్షిత ప్రదేశంలో భద్రపర్చుకున్న పడవలు



వలలను జాగ్రత్త చేసుకుంటున్న గంగపుత్రులు

పరవాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి అలల ఉధృతి అధికంగా ఉంది. రాత్రి వేళ అలల ఉధృతి మరింత ఎక్కువగా ఉంటుందని మత్స్యకార్మికులు చెప్పారు. అధికారుల హెచ్చరికలతో ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం, జాలారిపేట మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. తీరంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న పడవలు, వలలు, ఇంజిన్లను సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్త పడ్డారు. సముద్రం అనుకూలంగా లేని కారణంగా వారం రోజులుగా గంగపుత్రులు చేపల వేటకు వెళ్లడం లేదు. ఇంతలో తుఫాను రావడంతో మరో మూడునాలుగు రోజుల వేట మానుకోవడం వల్ల పూట గడవడం కష్టంగా ఉందని ముత్యాలు అనే మత్స్యకారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి సాయం ఇంతవరకు అందక పూట గడవడం కష్టంగా ఉందంటున్నారు. ప్రభుత్వం గంగపుత్రుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వెంటనే సమస్యను పరిష్కరించాలని వేడుకొంటున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి వినతి



ఈవోఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న యూత్ సభ్యులు

పరవాడ: మండలంలో వెన్నలపాలెం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన యూత్ సభ్యులు కోరారు. ఈ మేరకు మండల విస్తరణాధికారి రమేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని బోర్లు మరమ్మతులకు గురికావడంతో కొంత కాలం నుంచి గ్రామస్తులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని, బోర్లు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని యూత్ సభ్యులు వెన్నల గిరి, శ్రీను, సన్యాసిరావు, మారునాయుడు, అభినాయుడు, అప్పారావు, వీరు నాయుడు, ప్రసాద్, నాయుడు, రాజు వినతిపత్రం అందజేశారు.

బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం చేయాలి

సింహాచలం : అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా నుంచి పాత అడవి వరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ బాధితులు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను 98వవార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం కోరారు. కమర్షియల్ మార్కెట్ వాల్యూ అందరికీ సమానంగా ఉండాలని, అత్యధిక రేటు ఇవ్వాలని కోరారు. రిజిస్టర్ ఆఫీసులో అడవివరం ఏరియాని బీఆర్‌టీఎస్ మెయిన్ రోడ్డుగా లొకేట్ చేయాలని, ఇంకా కొంత మందికి టీడీఆర్‌లు, చెక్కులు ఇవ్వలేదని, వాటిని వెంటనే త్వరగా విడుదల చేయాలని కోరారు.

మేలుజాతి పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి



మేలు జాతి పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పరవాడ : మేలు జాతి పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి వస్తుందని పరవాడ పశుగణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణకీర్తి అన్నారు. పశుగ్రాస దినోత్సవంలో భాగంగా పరవాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాడి రైతులకు మేలు జాతి పశుగ్రాసం పెంపకం, పశుపోషణలో పశుగ్రాసం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మేలైన పశుపోషణ కోసం జొన్న, హైబ్రిడ్ నేపియర్, మొక్క జొన్న, పిల్లి పెసర, అలసంద వంటి పశుగ్రాసాలు పెంచాలని సూచించారు. రైతు సేవా కేంద్రంలో గడ్డి విత్తనాలు 75 శాతం రాయితీపై లభ్యమవుతున్నాయన్నారు. 5 కిలోల పశుగ్రాస విత్తనాలు రూ.460 కాగా రాయితీ పోను రూ.345లకు లభ్యమవుతాయని చెప్పారు. పొలం గట్లపై పశుగ్రాసం చెట్లు సుబాబుల్, అవిశ, మునగ, గంగారవి వంటివి పెంచుకోవాలని సూచించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చనని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యావావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

మూడో అంతస్తు పైనుంచి పడి తాపీమేస్త్రి మృతి



సురేష్(ఫైల్)

పరవాడ : పరవాడ గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమైన తాపీ మేస్త్రి ప్రమాదశాత్తు కాలు జారి మూడో అంతస్తు నుంచి కింద పడడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ గ్రామానికి చెందిన అమరపు సురేష్ (32) ప్రాణాలు కోల్పోయాడని పరవాడ సీఐ ఎస్.బాల సూర్యారావు చెప్పారు. సీఐ అందించిన వివరాల ప్రకారం పరవాడలో ప్రసాద్ సూపర్ మార్కెట్ వెనుక భాగంలో బండారు సింహాచలం నాయుడు నిర్మిస్తున్న మూడంతస్తుల భవన నిర్మాణ పనుల్లో సురేష్ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. సురేష్ యథావిధిగా గురువారం మూడో అంతస్తులో పనులు చేస్తుండగా మధ్యాహ్నం 3.40 గంటలకు ప్రమాదవశాత్తు కాలు జారి సుమారు 50 అడుగుల పై నుంచి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ డ్యూటీ డాక్టరు పరీక్షలు జరిపి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పరవాడ సీఐ బాలసూర్యారావు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి : జీవీఎంసీ పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. 97వ వార్డులోని శ్రమశక్తినగర్ 1, 6 లే అవుట్‌లు, చాణక్యనగర్, సప్తగిరినగర్ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా కాలనీల్లో సమస్యలను వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత ఎమ్మెల్యేకు వివరించారు. ఆయా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులకు పంచకర్ల ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హైమావతి, నాయకులు శానాపతి శంకర్రావు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.